

తుది దశకు శ్రీనివాస సేతు

నగర మేయర్ డాక్టర్ శిరీష



శ్రీనివాస సేతు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మేయర్ శిరీష

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: శ్రీనివాస సేతు నిర్మాణం పనులను మంగళవారం ఉదయం అధికారులతో కలిసి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తిరుమలకు వచ్చే భక్తుల, తిరుపతి నగరవాసుల ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడం కోసం శ్రీనివాస సేతు నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను, ఆప్కాన్స్ ప్రతినిధులను ఆదేశించారు. మేయర్ మీడియాతో మాట్లాడుతూ శ్రీనివాస సేతు నిర్మాణం పనులు తుది దశకు చేరుకుందని తెలియజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి స్మార్ట్‌సిటీ సంయుక్తంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు నిర్మాణం పనులు మూడు, నాలుగు వారాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామని తెలిపారు. శ్రీనివాస సేతు మొదటి, రెండో, మూడు దశ పనులు పూర్తి చేయడం జరిగిందని, నాలుగో దశ పనులు కొంచెం ఆలస్యమైనదని, నిర్మాణ పనులు ఆలస్యంపై కారణాలు తెలియజేశారు. రామానుజా సర్కిల్ నుండి రిలయన్స్ మార్ట్ వద్ద, రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న శ్రీనివాస సేతు పనులు కొరకు రైల్వేచీఫ్ ఇంజనీరింగ్ అధికారులు అనుమతి కొరకు శ్రీనివాస సేతు ప్లాన్ సమర్పించడం జరిగిందని, రెండు, మూడు రోజుల్లో అనుమతి వస్తుందని, వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసి జూలై మాసంలో ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామని తెలియజేశారు. నగరపాలక సంస్థ మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఆప్కాన్స్ ప్రతినిధి స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా

30న డిస్కం ముట్టడి

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్షం నిర్ణయం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం చడీచప్పుడు కాకుండా, చాపకింద నీరుల ప్రజలపై విద్యుత్ భారాలను మోపడాన్ని నిరసిస్తూ ఈనెల 30వ తేదీన ఏపిఎస్‌పిడిసిఎల్ సీఎండీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. సిపిఐ ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి అధ్యక్షతన అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ప్రజలు కడుతున్న విద్యుత్ బిల్లులకు ట్రూ అఫ్ ఛార్జీలు అదనంగా వేశారని, ఇది చాలదన్నట్టు 2014 నుంచి 19 వరకు వాడిన విద్యుత్తుపై అరియర్స్ పేరుతో అదనపు ఫీజును ప్రజల నుంచి వసూలు చేస్తున్నారని విమర్శించారు. చాపసాప కింద నీరులా విద్యుత్ ఛార్జీలను మోపుతున్న ప్రభుత్వం, ప్రజలకు మేలు చేస్తుందని అనుకోవడం పొరపాటేనని అన్నారు. సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను దోపిడి చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి పెద్దఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యుత్‌ఛార్జీలు పెంపు ఉప సంహరించే వరకు, ప్రజలు జగన్‌కు షాక్ ఇవ్వాలని తెలిపారు. తిరుపతి నగరంలో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింట విద్యుత్ బిల్లుల సర్వేలో ప్రజలు రెట్టింపుగా వస్తున్న బిల్లులతో సిపిఎంను పెద్దఎత్తున ఆశ్రయించారని గుర్తు చేశారు. ప్రజల్లో ప్రభుత్వం తీరుపై ఆక్రోసం ఉందని, ప్రజలను చైతన్య వంతులను చేసి, ప్రభుత్వ తీరును ఎండగట్టి, విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించే వరకు మరో విద్యుత్ పోరాటం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజానీకంపై విద్యుత్ భారాలు మోపడం బాధాకరమని అన్నారు. కేంద్రంలోని బిజెపికి వంత పాడుతూ రాష్ట్రంలో రైతులకు మోటర్లకి మీటర్లు పెట్టాలని నిర్ణయించడం శోచనీయమన్నారు. ఇచ్ఛాపురం నుంచి చిత్తూరు వరకు మోటార్లకు మీటర్లు పెట్టేందుకు అంగీకరించారని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో సైతం ఈవిధానాన్ని వ్యతిరేకిస్తుంటే, జగన్ ప్రభుత్వం వంతపాడడం విడ్డూరం ఉందన్నారు. పైగా రాబోయే రోజుల్లో స్మార్ట్‌మీటర్లు పెట్టేందుకు తీసుకోనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలని హితవుపలికారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ పోలవరం కుడికాలువ పూర్తి అయితే 900 మెగా ఓట్ల విద్యుత్తు ఉత్పత్తి వస్తుందన్నారు. కానీ కేంద్రం దాన్ని పూర్తి చేయకుండా థర్మల్ ద్వారా అధిక వ్యయంతో విద్యుత్తు కొనుగోలు చేస్తుందని, దీని ద్వారా ఆదానికి మేలు చేకూరుస్తుందని తెలిపారు. యూనిట్‌కి ఏడు రూపాయలు అదనంగా ప్రజల వద్ద నుంచి పిండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ద్వారాన్ని మోపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నగర కార్యదర్శి మాంగాటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలు, అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడుతున్న తరుణంలో ప్రజలకు ఎలా మేలు చేపడుతుందన్నారు. ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో చేపట్టబోయే విద్యుత్ ఉద్యమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. టిడిపి నాయకులు ఊకా విజయకుమార్ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు సంవత్సరాలలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని గుర్తు చేశారు. కరెంటు వాడకాన్ని డబ్బులు కట్టాల్సిన పరిస్థితులు దాపరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యమానికి టిడిపి మద్దతు తెలియజేస్తుందన్నారు. అనంతరం అఖిలపక్ష నాయకులు ఏకగ్రీవంగా ఈనెల 30వ తేదీన ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యాలయాన్ని ముట్టడించేందుకు నిర్ణయించారు. ఈఆందోళనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు ఆర్.లక్ష్మీ, టి.సుబ్రమణ్యం, ఎస్ఐఎఫ్ నాయకులు మాధవ్, సిపిఐ నాయకులు విశ్వనాథ్, ఏఐటీయూసీ నాయకులు రాధాకష్ణ, ఎన్డి రవి, రాజా, శివ, టిడిపి నాయకులు ఆర్‌సి మునికష్ణ, చినబాబు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫుడ్ స్ట్రీట్ కోసం పరిశీలన



ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటుపై చర్చిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరంలో ఓ అనువైన ఫుడ్‌స్ట్రీట్ ఏర్పాటు కోసం పరిశీలన చేద్దామని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటుపై చర్చించారు. భారత ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటు కోసం ప్రపోజల్స్ పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి స్థానికతకు అనుగుణంగా ఫుడ్‌స్ట్రీట్ ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని ముందుగా గుర్తించాలన్నారు. అనువైన ఫుడ్ స్ట్రీట్ కోసం స్థలం గుర్తించిన తరువాత ప్రజలకి ఇష్టమైన ఆహారపదార్థాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరసింహాచారి, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, మెప్మా కష్ణవేణి పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

ఎంఎల్‌ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఉచిత వైద్యసేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎంత ఖర్చు అయినా నా ప్రజలు కోసం భరిస్తా అని చంద్రగిరి ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలోని అరిగిలవారిపల్లి ప్రాథమిక పాఠశాల, పనపాకంహైస్కూల్, రవణప్పగారిపల్లిలలో ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిల ఆధ్వర్యంలో మెగా ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం ఎమ్మెల్యే పనపాకంలో మెడికల్ క్యాంపులను సందర్శించారు. అనంతరం మెడికల్ క్యాంపులో ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బిపి పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపుకు వచ్చిన ప్రజలను, వైద్యసిబ్బందిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరి ఆరోగ్యమే తమ ముఖ్య ఉద్దేశమని, అందుకోసం నియోజకవర్గ వ్యాప్తంగా మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ ఈ మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని చెవిరెడ్డి కోరారు. పనపాకం హైస్కూల్‌లోని విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయించాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. హైస్కూల్‌లోని విద్యార్థులు అందరూ వైద్యపరీక్షలు చేయించుకొన్నారు. విద్యార్థులకు చాక్లెట్లు అందజేశారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నారు. అందుకే రూ.2,950లు విలువ చేసే వైద్యపరీక్షలను ఉచితంగా చేపడుతున్నామని అన్నారు. సుమారు 25రకాల వైద్య పరీక్షలను చేయించడంతోపాటు వారి ఆరోగ్య వివరాలను గోప్యంగా సంబంధిత వ్యక్తికి సీల్డ్ కవర్లలో అందజేయనున్నట్టు వెల్లడించారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉంటే వారికి వైద్య సేవలను తామే తీసుకెళ్లి ఆసుపత్రుల్లో చేర్పించి వైద్యం అందిస్తామన్నారు. గ్రామాలలోని ప్రతిఒక్కరూ వైద్య శిబిరానికి వచ్చి వైద్యసదుపాయాలను పొందాలని ఆయన సూచించారు. ఈసీజీ, రక్త పరీక్షలను, ప్రతిఒక్క వ్యక్తి చేయించు కోవాలని తద్వారా ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, ప్రోటోకాల్ ఆర్డీవో భాస్కర్ నాయుడు, ఎంపీడీవో రమేష్ బాబు, ఎమ్మార్వో శిరీష, డిఎల్‌పిఓ రూపరాణి, ఈవోపీఆర్డి శశిరేఖ, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, పార్టీ నాయకులు అగరాల దేవారెడ్డి, జూపార్కు డైరెక్టర్ మణి యాదవ్, పానేటి చెంగల్రాయులు, సిహెచ్ రెడ్డెప్ప, వరలక్ష్మి, కసాగోపాల్, నాగభూషణం, డిచెంగల్రాయులు, పంచాయతీ కార్యదర్శి శిరీష, ఎఎన్‌యం గౌరి, నాగసుధారాణి, మాదవి, చేతుమాదవి, రఘు, పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను క్రమబద్ధీకరించడానికి సహకరించాలని అధ్యాపకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం శ్రీకాళహస్తిలోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాము గత కొన్నేళ్లుగా ఒప్పంద ప్రాతిపదికన ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకులుగా పని చేస్తున్నామన్నారు. అయినా తమను క్రమబద్ధీకరించలేదని అన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వారు కోరారు. ఇందుకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి సానుకూలంగా స్పందించారు. సుధీర్, గీత, ఫకర్దీన్ బాబా, ముని దమయంతి, అనిత కుమారి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ఆటంకం కలిస్తే కఠిన చర్యలు

తిరుమల, తిరుపతి పవిత్రతకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదు: ఎస్పీ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుమల తిరుపతి పవిత్రతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పి అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, మునిరామయ్యతో తిరుపతి, తిరుమల సబ్‌డివిజన్ల డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో మంగళవారం తిరుపతి పోలీస్ అతిథి గహం సమావేశ మందిరంలో నెలవారి నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పిక్ పాకెట్, మొబైల్ దొంగతనాలకు పాల్పడే నేరస్తులపై చిన్న, పెద్ద, ఆడ,మగ అనే భేదం లేకుండా అందరిపై కఠినంగా వ్యవహరించి చట్టప్రకారం క్రిమినల్ చర్యలను తీసుకున్నప్పుడే, తిరుమల, తిరుపతి పుణ్యక్షేత్రంలో భక్తుల ధన మాన ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ ప్రశాంతమైన వాతావరణాన్ని కలిగించిన వాళ్లమవుతామన్నారు. తిరుమల పుణ్యక్షేత్రంలో భక్తుల ముసుగులో కొంతమంది నేరస్తులు తలదాచుకుంటున్నారనే సమాచారం మేరకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి భక్తుల ముసుగులో తలదాచుకుంటున్న నేరస్తులను అదుపులోకి తీసుకొని విచారించడం వలన నేర నివారణ చేయడంతోపాటు, శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు తిరుపతి పోలీసులపై అపారమైన నమ్మకం, మర్యాద పెరిగి, తిరుపతి జిల్లా పోలీసుల ఖ్యాతి దశదిశలా వ్యాపిస్తుందన్నారు. తిరుపతిలోని బాలాజీ లింక్ బస్టాండ్, రుయా ఆసుపత్రి, గోవిందరాజు స్వామి సత్రాలు, సెంట్రల్ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ వంటి భక్తుల రద్దీ ప్రదేశాలలో నేరస్తులు బిచ్చగాళ్ళ వేషంలో ఉంటూ నగరంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. ఈ ప్రాంతాల్లో అక్రమంగా నివాసముంటున్న వారు తక్షణం తిరుపతి నగరాన్ని వదిలి వెళ్లిపోవాలని హెచ్చరించారు. తిరుమలలో వద్ధులను, మహిళలను కొంతమంది కావాలనే వదిలిపెట్టి వెళ్ళిపోతున్నారు. ఈ సంఘటనలు చాలా బాధాకరమన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై తీవ్రమైన కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్‌గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిటీ, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్ కేసులు, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు మరియు ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి, కేసులను చేధించడానికి వాటి పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు తెలుపుతూ దిశా నిర్దేశాలు చేశారు. తిరుమల ఘాట్ రోడ్ గురించి సరైన అవగాహన, ఘాట్ ఫిట్నెస్ లేనటువంటి ఇతర రాష్ట్రాలకు చెందిన తుఫాన్, టెంపో ట్రావెలర్ వంటి వాహనాలను తిరుమలకు అనుమతించడం వలన ఘాట్ రోడ్ నందు ఇటీవల కాలంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటువంటి వాహనాలను తిరుమలకు అనుమతించకుండా సప్తగిరి టోల్ ప్లాజా వద్ద ప్రత్యేక కార్యాచరణ ద్వారా ముందుకు వెళ్లి, తిరుమల ఘాట్‌రోడ్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించాలని అధికారులకు ఆదేశించారు. గంజాయి వినియోగంపై ప్రజలలో విస్తతమైన అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, గంజాయి వ్యవహారానికి సంబంధించిన వ్యక్తులపై కఠినమైన క్రిమినల్ కేసులను నమోదు చేస్తూ మెరుపు దాడులను, ఆకస్మిక నిఖీలను నిర్వహిస్తూ, గంజాయి అక్రమ రవాణా, సరఫరా, వినియోగం జరగకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి నగరంలో శాంతి భద్రతలను కాపాడుతూ, నేర నియంత్రణ, నివారణ చేస్తూ ప్రజలు జీవించటానికి ప్రశాంతమైన వాతావరణాన్ని ఇవ్వడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలన అందించి, అభినందించారు.

యోగాతో ఆయుష్..!



ప్రజాశక్తి- తిరుపతి సిటి

9వ ఇంటర్నేషనల్ యోగాడేని పురస్కరించుకుని తిరుపతి జిల్లా ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్‌వి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రారంభైన ఈ ర్యాలీ మంచినీళ్లగుంట అర్బన్ హెల్త్‌సెంటర్, నరసింహాతీర్థం వీధి, టౌన్‌క్లబ్ వరకు సాగింది. ఈసందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ వైద్యులు డాక్టరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. మనం నిత్య జీవితంలో యోగిని ఒక భాగంగా చేసుకోవడం ద్వారా అందరం ఆరోగ్యగా ఉండవచ్చని తెలిపారు. యోగాసనాలు, ప్రాణామాయాలు ద్యానం శారీరక, మానసిక ఆరోగ్యానికి సోపానాలు అని తెలిపారు. ఈ నెల 21వ తేది కపిలతీర్థంరోడ్డులోని ఎస్‌వి పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే ఇంటర్నేషనల్ యోగాడే ఉత్సవాల్లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈర్యాలీలో ఆయుష్ శాఖ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.96 లక్షలతో 'జల ప్రసాదం'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు తాగునీటిని అందించాలనే ఆశయంతో దివిస్ లేబరోటరీ వారు రూ.96లక్షలతో 'జలప్రసాదం' ఏర్పాటు చేశారు. ఈజలప్రసాదం కేంద్రాలను మంగళవారం దివిస్ లేబరోటరీ మేనేజింగ్ డైరెక్టరు దివి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కంటి భక్తులకు తాగునీటిని అందించాలనే ఆశయంలో ఈ జలప్రసాదం కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఈఅవకాశం వినియోగించుకోవాలని ఆయన కోరారు. కాగా ఈ జలప్రసాదం కార్యక్రమంలో సినీ నటుడు జేడీ చక్రవర్తి కూడా పాల్గొన్నారు. ఇక ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ.సాగర్ బాబు, దివీస్ లేబరోటరీస్ ఆర్గనైజర్ శ్రీనివాసులు, గోపి పాల్గొన్నారు.

శివయ్య సేవలో సుప్రీం కోర్టు జడ్జి



ప్రజాశక్తి- శీకాళహస్తి: శ్రీకాళహస్తిలో వెలసిన వాయులింగేశ్వరుని మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిరుద్దా బోస్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ.సాగర్‌బాబు వీరికి దక్షిణ గోపురం వద్ద సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. జస్టిస్ అనిరుద్ధా బోస్ మొదట రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని

ఎన్ఎంఆర్ ఉద్యోగుల వినతి



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గత 23 సంవత్సరాలుగా వివిధ శాఖలలో వివిధ రకాలుగా విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగులకు టైంస్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డికి ఆ సంఘం అధ్యక్షులు శివానందరెడ్డి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పలుమార్లు ఎన్ఎంఆర్ ఉద్యోగులను టైం స్కేల్ ఉద్యోగులుగా వర్తింపచేయాలని అందించామన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను కాంటాక్ట్ ఉద్యోగాలను శాశ్వత ఉద్యోగులుగా ఇచ్చినటువంటి జీవోను ఎస్వీయూలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగులకు కూడా ఆ జీవో వర్తించే విధంగా అధికారులు కషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్ఎంఆర్ ఉద్యోగులందరూ ముకుమ్మడిగా సమ్మె చేయాలని నిర్ణయించడం జరిగిందని వెల్లడించారు. వేమారెడ్డి, ప్రతాప్, మదన్, సురేష్, చిరంజీవి, ఓబుల్ రెడ్డి, దొరబాబు, విశాలాక్షి, జయచంద్ర, శ్రీరాముల్ రెడ్డి, కుమారస్వామి, యుగంధర్, మనోహర్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసే 'ఆర్‌సి రెడ్డి'



కళాశాల డైరెక్టర్
డాక్టరు పి.రవిచంద్రారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటి

గ్రాడ్యుయేట్ల భవితకు మార్గం చూపాలనే ఆకాంక్షతో, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని దోహదపడాలనే లక్ష్యంతో 2002లో తిరుపతి విజయనగర్ కాలనీ (ఇంజనీర్స్ లేఅవుట్)లో డిఎన్.ఆర్‌సి రెడ్డి డిగ్రీ కాలేజీని స్థాపించినట్లు ఆ కళాశాల డైరెక్టర్ డాక్టరు పి.రవిచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌సి రెడ్డి డిగ్రీ కళాశాలలలో 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభ, ప్రజ్ఞను వెలికి తీస్తూ వారి ఉన్నత జీవితాలకు బాటలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ విద్యతో పాటు సిపిటి, ఐసెట్, డిఫెన్స్ కోచింగ్, పిజి సెట్‌కు శిక్షణనిస్తున్నట్లు పేర్కొన్నారు. కాన్సెప్ట్ బోధన, సెమినార్స్, క్యాంపస్ సెలక్షన్స్, ప్రొగ్రెస్ రిపోర్టు పంపడం తమ ప్రత్యేక అన్ని చెప్పారు. 2009లో ఎన్.ప్రతిమ, 2010లో ఎస్.షీరీన్ ఫర్వాహ అనే విద్యార్థినులు యూనివర్శిటీ గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. పుణ్యస్థలి అయిన తిరుపతిలో గ్రాడ్యుయేట్ విద్యార్థుల విజయం కోసం కృషి చేస్తున్న ఆర్‌సి రెడ్డి డిగ్రీ కళాశాలకు ఎదురేలేదన్నారు. ఇస్కాన్, వర్శిటీలోని వివిధ శాఖల్లో అద్వితీయమైన బహుమతులు గెల్చుకున్న ఏకైక సంస్థ తమదేనని ఆయన పేర్కొన్నారు.

విద్యతో పాటు క్రీడలు....

తమ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు. 2009లో ఎస్‌వి అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్‌ను దిగ్విజయంగా నిర్వహించామని, 2010లో టెన్నీస్, చెస్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీలలో తమ విద్యార్థులు యూనివర్శిటీకి ప్రాతినిధ్యం వహించారన్నారు. మహిళా క్రికెట్‌లో లావణ్య, మౌనికా సాయి రాష్ట్రస్థాయిలో అండర్ 22 జట్టుకు నాయకత్వం వహించేలా ప్రోత్సహిస్తున్న ఏకైక కళాశాల డాక్టరు ఆర్‌సి రెడ్డి డిగ్రీ కాలేజి అని పేర్కొన్నారు.

ఆధునిక బోధన..

నేటి పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. మూసపద్ధతిలో కాకుండా ఎల్‌సిడి ప్రొజెక్టర్ ద్వారా క్లాసెస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



క్యాంపస్ సెలక్షన్స్...

విద్యాబోధనతో పాటు ఉద్యోగా అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని అన్నారు. బహుళ జాతి సంస్థల క్యాంపస్ సెలక్షన్స్‌లో విజేతులుగా తీర్చిదిద్దడంలో తమ సంస్థ అగ్రగామిగా నిలబడుతోందని పేర్కొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్....

ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించేందుకు ప్రత్యేక కరిక్యులమ్, విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికై గ్రూప్ డిస్కషన్స్, లాంగ్వేజ్ క్లాసులు, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ షెడ్యుల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎడ్యుకేషనల్ టూర్స్...

చదువుతో పాటు అన్నిరంగాల్లో విద్యార్థులు అభివృద్ధి సాధించేందుకు ఎన్విరాన్‌మెంటల్ ఇండస్ట్రియల్ అందే ఎడ్యుకేషనల్ టూర్స్‌ను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ రవిచంద్రారెడ్డి తెలిపారు.

అధ్యాపక బృందం...

ప్రతి సబ్జెక్టులో అనుభవం కలిగిన అధ్యాపకులు తమ కళాశాలలో ఉన్నారని, అందుకే తమ విద్యాసంస్థలు సంచలన విజయాలు సాధిస్తున్నాయని తెలిపారు.



ఆరోగ్య యోగం..!



నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

- యోగాతో సర్వరోగాలు మాయం
- వేద భూమిలో పుట్టి విశ్వవ్యాప్తం
- శరీరాన్ని నడిపించే చైతన్యశక్తి
- ఉచితంగా శిక్షణ ఇస్తున్న సుబ్రహ్మణ్యం





వేద భూమిగా పేరుగాంచిన భారతదేశంలో పుట్టిన యోగా నేడు ప్రపంచ దేశాల ప్రజలకు ఆరోగ్య వరప్రసాదినిగా మారింది. సనాతన భారతీయ సాంప్రదాయ పద్ధతులు నేడు ప్రపంచంలో ఎన్నో దేశాల ప్రజలు అవలంభిస్తున్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని.. జ్ఞానాన్ని పొందడంతో పాటు ఊబకాయం, రక్తపోటు, మధుమేహం, వెన్నునొప్పిలాంటి సమస్యలు రాకుండా ఉంటాయి. జూన్ 21 బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

యోగాతో మానవ శరీర అవయవాలను దీర్ఘకాలం పని చేయించడంలో.. చురుకుదనాన్ని కలిగి ఉండటంలో.. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడంలో.. యోగా సాధన ఒక అమూల్యమైన సంజీవని లాంటిది. యోగాను అంతర్జాతీయంగా బహు ప్రాచుర్యం చెందడానికి మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలలోని ప్రజలు వారి ఆరోగ్య రుగ్మతలకు పరిష్కారం ఎంచుకోవడానికి యోగా సాధనను మొదలుపెట్టారు. ప్రపంచంలో అత్యధిక శాతంగా ఊబకాయం, మధుమేహం, మానసిక పరిస్థితి బాగోలేకపోవడం, ఇలా అనేక అనారోగ్య సమస్యలకు యోగా చక్కటి పరిష్కారంగా చూపబడుతోంది. దీని విశిష్టతను గుర్తించిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం మహానందిలోని సత్యసాయి ధ్యాన మందిరంలో యోగా శిక్షకులు బిక్షమయ్య గురూజీ వద యోగాసనాలను అభ్యసించారు. తాను నేర్చుకున్న యోగాసనాలను పదిమందికి చెప్పి వారిని సైతం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో 2014లో పుత్తూరులోని జ్ఞాన జ్యోతి విద్యామందిలో ప్రారంభించి నేడు త్రినేత్ర పిరమిడ్ దివ్యజ్ఞాన మందిరం వేదికగా యోగాపై చుట్టుపక్కల వారికి శిక్షణ మొదలు పెట్టారు. ప్రారంభంలో పదుల సంఖ్యలో వచ్చిన ప్రజానీకం యోగా విశిష్టతను పూర్తిస్థాయిలో అవగతం చేసుకొని శిక్షణ పొందడానికి వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. వీరికేగాక కార్వేటినగరం, పుత్తూరు, నగరి, నారాయణవరం పరిసర ప్రాంతాల ప్రజలకు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, వివిధ రంగాలకు చెందిన వారికి యోగాతో లభించే సంపూర్ణ ఆరోగ్య విషయాలను విశదీకరించి ఆసనాలతో సుబ్రమణ్యం వివరించారు. కరోనా తరువాత శిక్షణ పొందిన వారు వారి ఇళ్ల వద్దనే యోగాసనాలు వేస్తూ ఆరోగ్యవంతులుగా జీవనం సాగిస్తున్నారు. కొత్తగా యోగా విశిష్టతను తెలుసుకోవాలనుకునే వారు సుబ్రహ్మణ్యం నిర్వహిస్తున్న యోగా శిక్షణ కేంద్రానికి వచ్చి యోగాసనాలను నేటికీ నేర్చుకుంటూనే ఉన్నారు.

అవయవాల సామర్థ్యాన్ని పెంచొచ్చు



మానవ శరీరంలోని అవయవాల పని సామర్థ్యాన్ని యోగాసనాలతో పెంపొందించుకోవచ్చు. కాలానుగుణంగా ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పులు ఆరోగ్య రుగ్మతలకు నేడు అధిక భాగం కారణమవుతున్నాయి. ప్రజలు యోగా విశిష్టతను గుర్తించి యోగాసనాలను క్రమం తప్పకుండా ఆచరిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించడానికి అవకాశం ఉంది. ఎప్పుడూ ఉత్సాహంగా ఉండాలన్నా.. అనారోగ్య సమస్యలను అదుపు చేయాలన్నా యోగా ఒక మంచి మందు.

- డీఎన్.వెంకటేశులు, సీహెచ్‌వో, పుత్తూరు


దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం



2014 నుంచి నేను యోగాసనాలను నేర్చుకొని రోజూ క్రమం తప్పకుండా ఆసనాలను వేస్తున్నాను. ఇప్పుడు నా ఆరోగ్యం చాలా బాగుంది. థైరాయిడ్, బీపీ, మానసిక ఒత్తిడి నుంచి కూడా బయట పడటానికి యోగా నాకు చాలా సహాయ పడింది. యోగా విలువను గ్రహించి అందరూ ఆరోగ్యవంతులుగా ఉండటానికి యోగాసనాలను నేర్చుకోండి.

- ఈశ్వరమ్మ, గృహిణి, పుత్తూరు.

ఆరోగ్య జీవనాన్ని గడుపుతున్నా





యోగా గొప్పతనాన్ని గుర్తించి ఆసనాలను శిక్షకుల నుంచి నేర్చుకుని నేడు ఆరోగ్యంగా ఉన్నాను. రక్తపోటు అదుపులో ఉండడమే కాకుండా కిడ్నీ క్రియాటిన్ లెవెల్స్ అదుపులో ఉన్నాయి. ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి యోగా ఎంతగానో ఉపకరిస్తుంది.

- కుప్పయ్య శెట్టి, యోగా సాధకులు

యోగా మానసిక ప్రశాంతత






విధి నిర్వహణలో మాకు శారీరక దఢత్వం ఎంతో కీలకం. యోగా సాధనతో మానసిక ప్రశాంతత, శారీరక దఢత్వాన్ని పొందాను. రోజూ యోగాసనాలను చేయడంతో ఇప్పటివరకు మధుమేహం, రక్తపోటు వంటివి నా దరి చేరలేదు.

-కృష్ణంరాజు, పోలీస్ హెడ్ కానిస్టేబుల్

ఆరోగ్య వరప్రసాదిని..యోగా





యోగా ఫ్లెక్సిబిలిటీ, ధృడత్వాన్ని అందించే సాధనం. యోగాసనాలు శరీర అంతర్గత అసమతుల్యాలను నయం చేసి.. వ్యాధుల నుంచి పోరాడే శక్తిని సమకూర్చుతుంది. ఆసనాలు వేస్తున్నప్పుడు శరీరంలోని ప్రతి కండరం సాగుతుంది. సాంత్వన కలుగుతుంది. యోగా మన మనసు, శరీరం, ఆత్మలను అనుసంధానిస్తుంది. కాబట్టే లైఫ్‌స్టయిల్ సంబంధిత రుగ్మతలకు సమర్థవంతంగా సమాధానం చెప్పగల్గుతుంది. జీవన విధానం సక్రమంగా లేకపోతే ఊబకాయం, రక్తపోటు, మధుమేహం, వెన్ను సమస్యలు.. వంటి ఎన్నో సమస్యలు వెంటాడుతాయి. వాటిని దరిచేరనీయకుండా ఆయా రుగ్మతలకు కారణమైన అవయవాలను ఆరోగ్యంగా ఉంచే యోగాసనాలను సాధన చేయాలి. పుత్తూరులో ఉచితంగా అందించే యోగా తరగతులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

- సుబ్రహ్మణ్యం, యోగా గురువు, పుత్తూరు

ఎస్వీయూలో అంతర్జాతీయ యోగా దినం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జూన్ 21న వచ్చే అంతర్జాతీయ యోగా దినాన్ని పురస్కరించుకొని ఒకరోజు ముందుగా మంగళవారం యోగా దినం నిర్వహించారు. వివేకానంద కేంద్ర- కన్యాకుమారి వారి తిరుపతి చాప్టర్ ప్రముఖులు డాక్టర్ హరికష్ణ పాకనాటి, ఎన్ఎస్ఎస్ యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజ్ యూనిట్ ఇంచార్జ్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినం చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల ప్రముఖ్ మారుతి మోహన్, డా.నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర ప్రసాద్, ఒలంపిక్ అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి సురేంద్ర, అబాకస్ రామకష్ణారెడ్డి, ప్రసన్న కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లూరు హేమచంద్రకు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి-క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజినీరింగ్ పరిశోధక విద్యార్థి నెల్లూరు హేమచంద్రకు డాక్టరేట్ డిగ్రీని చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆమ్లా నాయక్ ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆచార్య కోట నాగేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో "రేషనల్ అసెస్మెంట్ అఫ్ కంప్యాక్షన్ అండ్ స్ట్రెంగ్త్ చారసీటెరిస్టిక్స్ అఫ్ సుబిగ్రేడ్ సోయిల్స్ ఫర్ సస్టైనబుల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. హేమచంద్ర నెల్లూరు ఇందిర, స్వర్గీయ నెల్లూరు రవి కిషోర్ ల పెద్ద కుమారుడు. నెల్లూరు రవికిషోర్ తహశీల్దార్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం నెల్లూరు హేమచంద్ర ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్, ఏ కామ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కోసం పిఎస్ గా పని చేస్తున్నారు. అతను అంతకుముందు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బ్యాచ్ (2006-2008) బ్యాచ్‌కు చెందిన యూనివర్శిటీ టాపర్‌గా నిలిచారు. హేమచంద్ర పలు జాతీయ అంతర్జాతీయ పరిశోధనా జర్నలిస్టులలో అనేక పరిశోధన పత్రాలు పత్రాలను ప్రచురించినట్లు వివరించారు డిగ్రీ అవార్డు రావడంపై పలువురు ఆచార్యులు పరిశోధకులు కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

నవోదయ విద్యాలయలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-క్యాంపస్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-2025 విద్యాసంవత్సరాకి గాను ఆరోతరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడిందని తిరుపతి విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్ర అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధిస్తే అత్యున్నత ప్రమాణాలతో సీబీఎస్ఈ సిలబస్‌తో ఉచితంగా చదువు, వసతి, భోజనం కల్పిస్తారని..రెగ్యులర్ చదువతో పాటు నీట్, జేఈఈ వంటి జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ జవహర్ నవోదయాలు దేశవ్యాప్తంగా 649 ఉన్నాయని.. వీటిలో ఏపీలో 15, తెలంగాణలో 9 ఉన్నాయన్నారు. ఒక్కో నవోదయ విద్యాలయంలో గరిష్టంగా 80 మంది విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. 2023-2024 విద్యా సంవత్సరంలో అయిదో తరగతి చదువుతున్నవారు జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్టు (జేఎన్‌వీఎస్‌టీ) రాయడానికి అర్హులన్నారు. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష 2024 జనవరి 20న ఉంటుందన్నారు. ఆగస్టు 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2022-2023 నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యా సంస్థలలో శిక్షణ పొందిన 57 మంది విద్యార్థులు సీట్లు సాధించి రికార్డు సష్టించారని తెలిపారు. పరీక్షకు సంబంధించి మరిన్ని వివరాల కోసం 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించగలని కోరారు.

సత్యవేడు తహశీల్దారుగా షేక్ జరీనా



ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు నూతన తహశీల్దారుగా షేక్ జరీనా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తిలో పనిచేస్తూ బదిలీపై సత్యవేడుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దారు శ్రీదేవి కేవీబీపురం బదిలీ అయ్యారు.

29 నుంచి జులై 5 వరకు తిరుపతిలో చతుర్వేద హవనం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: లోక కల్యాణార్థం టీటీడీ పరిపాలన భవనంలోని పరేడ్ మైదానంలో ఈ నెల 29 నుండి జూలై 5వ తేదీ వరకు శ్రీశ్రీనివాస చతుర్వేద హవనం నిర్వహిస్తున్నట్లు జేఈవో సదా భార్గవి తెలిపారు. మంగళవారం జేఈవో అధికారులతో కలిసి పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ శ్రీశ్రీనివాస చతుర్వేద హవనం కార్యక్రమాన్ని టీటీడీ గతంలో విశాఖపట్నం, కోవూరులో నిర్వహించిందన్నారు. తిరుపతిలో మొదటిసారిగా 7 రోజులపాటు నిర్వహిస్తున్న ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఇందులో వేదాల ప్రాముఖ్యత, వేదాలు ఎలా ఉద్భవించాయి, వేదాల విశిష్టత, వేదాలు ప్రపంచానికి ఏ విధంగా మేలు చేస్తాయనే అంశాలపై ప్రముఖ పండితులతో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. చతుర్వేద హవనంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్టాల నుండి 32 మంది రుత్వికులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారని తెలిపారు. మైదానాన్ని ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఉదయం హోమ కార్యక్రమాలు, సాయంత్రం అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భక్తి సంగీత కార్యక్రమాలు, తరిగొండ వెంగమాంబ చరిత్ర ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేద విశ్వవిద్యాలయం విసి ఆచార్య రాణి సదాశివమూర్తి, సిఏఓ శేష శైలేంద్ర, సిఈ నాగేశ్వరరావు, విజిఓ మనోహర్, గోశాల డైరెక్టర్ హరినాథ రెడ్డి, పిఆర్‌ఓ డాక్టరు టి.రవి, డిపిపి ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాలరావు, డిపిపి కార్యదర్శి శ్రీనివాసులు, అదనపు ఆరోగ్యాధికారి డాక్టరు సునీల్, ఈఈ ప్రసాద్, డిఈ (ఎలక్ట్రికల్) సరస్వతి, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి విభీషణ శర్మ పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి




ప్రజాశక్తి-రేణిగుంట: గాజులమండ్యం ఎస్వీ సహకార షుగర్ ఫ్యాక్టరీలో పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలు, పీఎఫ్, పెన్షన్లు, రైతు బకాయిలు చెల్లించాలని ఎస్‌వీ షుగర్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి సుబ్బయ్య, సిఐటియు మండల అధ్యక్షుడు టి. నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీ మూసేసి ఏడు సంవత్సరాలు దాటినా ఇప్పటి వరకు బకాయిలు చెల్లించక పోవడంతో దారుణమన్నారు. కార్మికులు, రైతులు ఆందోళన చెందుతున్న సందర్భంలో ఫ్యాక్టరీ ఆవరణలోని చెట్లను నరకడానికి టెండరు పిలవడంతో మంగళవారం కార్మికులు సహకార సంస్థల లిక్విడేటర్ రవిబాబును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటరమణ, కల్లూరు సుధాకర్, మనోరాచారి, నారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

శివాని స్టడీ సర్కిల్ విద్యార్థుల ప్రభంజనం



ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో గూడూరు పట్టణంలోని శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి అభినందించారు. అనంతరం ఎం.శివకుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఎం.పూజిత 8,953వ ర్యాంక్, పి.నికిత 9,497 వ ర్యాంక్ ,15 వేల లోపు 6 మంది, 20 వేల లోపు 9 మంది, 25 వేల లోపు 14 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతు శివాని స్టడీ సర్కిల్ అన్ని పోటీ పరీక్షల కోచింగ్ ఇస్తూ రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం అభినందనీయమని కొనియాడారు. అధ్యాపకులు మల్లికార్జున, మునిరాజా, విద్యార్థులు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ వితరణ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ భవనంలో రోటరీ క్లబ్ గూడూర్ వెస్ట్ ప్రెసిడెంట్ బండి ధనుంజయరెడ్డి 55వ జన్మదినం సందర్భంగా నిరుపేద వితంతు మహిళ అయిన శ్యామలమ్మకు బండి ధనుంజయరెడ్డి దాతత్వంతో రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌ను అందించారు. దాత మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా ఓ మహిళకు కుట్టు మిషన్ ఇవ్వడం సంతోషకరమని.. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతుంటాయన్నారు. రొటేరియన్స్ సమక్షంలో బండి ధనుంజయ రెడ్డిచే కేక్ కోసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గోపాల్ రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, వాసు గౌడ్, శ్రీనివాసులు, రాఘవరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, బలరామిరెడ్డి, సుబ్రహ్మణ్యం, హరినాథ్ రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

మనోవిజ్ఞాన శాస్త్రంలో చంద్రయ్య సేవలు శ్లాఘనీయం



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మనోవిజ్ఞాన శాస్త్ర విభాగంలో విద్యార్థులకు, పరిశోధకులకు, వర్సిటీకి ఆచార్య చంద్రయ్య సేవలు అమోఘమైనవని వక్తలు పేర్కొన్నారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మనోవిజ్ఞాన శాస్త్ర విభాగంలో విశేష సేవలు అందించిన అనేక ఉన్నత పదవులు స్వీకరించిన, అంకితభావంతో వత్తి ధర్మాన్ని నిర్వహించిన చంద్రయ్య పదవి విరమణ సభ ఎస్ వి యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆచార్య బాబురావు, శ్రీనివాసరావు, కుళాయి రెడ్డి, ఎస్వీ మెడికల్ కాలేజ్ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ మానసిక విభాగంలో చాలావరకు ప్రయోగాలు చేసిన డాక్టర్ చంద్రయ్య శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మనో విజ్ఞాన విభాగంలో సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డా. హరికష్ణ, జి. మురళి, సురేష్ బాబు, రమణయ్య, వేణు రెడ్డి, చంద్రకుమార్, ఢిల్లీ రాణి, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవానికి అధికారులు హాజరు కావాలి



ప్రజాశక్తి -గూడూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన పౌర హక్కుల దినోత్సవానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కిరణ్ కుమార్ అధ్యక్షతన డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గత నెలలో జరిగిన పౌర హక్కుల దినోత్సవంలో డివిఎంసి సభ్యులు తెలిపిన వివిధ సమస్యలను 90 శాతం అధికారుల పరిష్కరించారని, మిగిలిన 10 శాతం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలందరికీ అనుభవంలో ఉన్న సాగు భూమిని పంపిణీ చేసేందుకు అసైన్మెంట్ కమిటీలో గుర్తించి పంచుతామన్నారు. అయితే కొంతమంది దళారులు అసైన్మెంట్ లబ్ధిదారులను గుర్తించి నేరుగా వారికి ఫోన్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని.. అలాంటి వారి మాటలకు మోసపోవద్దని ఎమ్మెల్సీ తెలిపారు. లబ్ధిదా రులు మోసగించే దళాలను గుర్తిస్తే చర్యలు తప్పవు అన్నారు. ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ పౌరహక్కుల దినోత్సవానికి గైర్హాజరు అయిన అధికారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఎదుర్కొంటున్న సమస్యలను, దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని, శిథిలావస్థకు చేరిన గహాలు తొలగించి నూతనంగా ఇళ్లు మంజూరు మంజూరు చేయాలని డివిఎంసి సభ్యులతో పాటు, ఎమ్మెల్యే ప్రసాద్ రావు గత సమావేశంలో చర్చించారన్నారు. వాటిని ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎన్ వి.రమణయ్య డివిజనల్ కమిటీ సభ్యులు మాకాని వెంకటేశ్వర్లు, రవీంద్రబాబు, అడివయ్య, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం పూర్తి చేయాలి



ప్రజాశక్తి బాలాయపల్లి : నాడు-నేడులో భాగంగా జరుగుతున్న అంగన్‌వాడీ భవనం పనులు పూర్తి చేయాలి సీడీపీవో శంషాద్ బేగం అన్నారు. మంగళవారం మండలంలోని యాచవరంలో జరుగుతున్న అంగన్‌వాడీ భవనం పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.